సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025


పెందుర్తి జంక్షన్ వద్ద జనసేతకు స్వాగతం పలుకుతున్న అశేష జనవాహిని


మీడియాతో మాట్లాడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


భీమబోయినపాలెం మెడికల్ కాలేజీ వద్దకు భారీగా తరలివచ్చిన ప్రజలు

- విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి పెందుర్తి, అనకాపల్లి మీదుగా పర్యటన
- జనజాతరతో హోరెత్తిన ఉమ్మడి విశాఖ జిల్లా
- కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించినా వెరవని ప్రజలు
- రోప్‌పార్టీలు, చెక్‌పోస్టులు దాటుకొని జగన్‌తో కరచాలనం చేసేందుకు పోటీ
- భారీ వర్షంలోను హుషారుగా సాగిన జగన్ పర్యటన
- ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పరిశీలన
- అనంతరం కేజీహెచ్‌లో కురుపాం గిరిజన బాలికలకు పరామర్శ

అడుగడుగునా అదే ఆప్యాయత

మండుటెండలోనూ అడుగు వెనక్కిపడలేదు. ఆకాశం చిల్లుపడేలా వర్షం పడినా వెరవలేదు. అదే అభిమానం.. చెక్కు చెదరని ఆదరణ. విశాఖ పర్యటనకు వచ్చిన జననేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అడుగడుగునా హారతులు పట్టారు. ప్రతి జంక్షన్‌లోను పూల వర్షం కురిపించారు. గజమాలలతో స్వాగతాలు పలికారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి మాకవరపాలెం మెడికల్ కాలేజీ వరకు సాగిన ఈ పర్యటనలో బ్రహ్మరథం పట్టారు. ఈ పర్యటనకు జనాలు రాకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటన్నింటినీ పటాపంచలు చేశారు. బారికేడ్లు, రోప్ పార్టీలు, చెక్‌పోస్టులు జనహోరు ముందు నిలవలేకపోయాయి. జంక్షన్లు జనజాతరను తలపించాయి. మార్గంమధ్యలో బాధలు, సమస్యలతో వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరిస్తూ.. వారికి భరోసా ఇస్తూ.. సుమారు 60 కిలోమీటర్ల మేర అభిమానంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ అభివాదాలు చేస్తూ.. జనసునామీలో ముందుకు సాగారు. అభిమాన నేతకు కరచాలనం చేసేందుకు మహిళలు, వృద్ధులు, యువత పోటీ పడ్డారు. సాధారణంగా 60 కిలోమీటర్ల ప్రయాణానికి గంటన్నర సమయం పడుతుంది. కానీ విశాఖను చుట్టేసిన జన సంద్రాన్ని తన చిరునవ్వుతో పలకరిస్తూ సాగిన ఆయన పర్యటనకు 6 గంటలు పట్టిందంటే ప్రజానీకం ఎలా వెల్లువలా వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. – విశాఖ సిటీ

అడ్డంకులు సృష్టించినా జన సునామీ


చోడవరం-అనకాపల్లి రోడ్డులో దుడ్డుపాలెం జంక్షన్ వద్ద వాహనాలు చెక్ చేస్తున్న పోలీసులు


గోపాలపట్నం వద్ద కార్యకర్తలు, నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ఇందులో భాగంగానే అసలు మెడికల్ కాలేజీల నిర్మాణాలే జరగలేదని, మాకవరపాలెంలో నిర్మాణంలో ఉన్న కాలేజీకి జీవో ఉంటే చూపించాలని మంత్రులు సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం మెడికల్ కాలేజీ నిర్మాణాలను పరిశీలించడానికి గురువారం విశాఖకు వచ్చారు. జగన్ పర్యటనకు భారీగా జనసందోహం తరలివస్తుండడంతో కూటమి ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. దీంతో ముందు ఆయన రోడ్‌షోకు అనుమతి లేదని పోలీసులతో చెప్పించింది. ఎన్ని అడ్డంకులు సృష్టించిన రోడ్‌షో ఆగేది లేదని వైఎస్సార్‌సీపీ నేతలు తెగేసి చెప్పడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. జగన్ రోడ్‌షో చేస్తే జనసునామీ తప్పదని భావించిన చంద్రబాబు ప్రభుత్వం రాత్రికి రాత్రి షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేసింది. పోలీసుల సాయంతో ఆటోలు, ప్రైవేటు వాహన యజమానులతో సమావేశాలు పెట్టించి.. జగన్ కార్యక్రమానికి జనాలను తీసుకువెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేయించింది. అలాగే వైఎస్సార్‌సీపీ నేతలకు ఫోన్లు చేయించి జన సమీకరణ చేయకూడదని బెదిరించే ప్రయత్నం చేసింది. గురువారం తెల్లవారుజాము నుంచే రోడ్లపై బారికేడ్లు, రోప్ పార్టీలు దర్శనమిచ్చాయి. గ్రామాల్లో చెక్‌పోస్టులు వెలిశాయి.

- ప్రధానంగా విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు వేల మంది జనాలు వస్తారని భావించిన పోలీసులు ఎన్ఎస్‌టీఎల్ గేటు ఎదురుగా బలగాలను మోహరించారు. ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో గ్రూపులుగా విమానాశ్రయం రహదారిలోకి వెళ్లకుండా నిరోధించే ప్రయత్నం చేశారు. ఎయిర్‌పోర్టు రహదారి ప్రారంభంలో కూడా పోలీసులు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులను అడ్డుకున్నారు.
- ఎయిర్‌పోర్టు నుంచి మాజీ సీఎం జగన్ కాన్వాయ్ బయలుదేరిన తర్వాత ఎన్ఏడీ కొత్త రోడ్డు వద్ద వెనుక ఉన్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల వాహనాలను అడ్డగించారు. కేవలం పోలీస్ ఎస్కార్ట్‌తోనే జగన్ కాన్వాయ్‌ను అనుమతించారు.
- గోపాలపట్నం, సింహాచలం ముఖద్వారం, వేపకుండా కూడలి, పెందుర్తి- అనకాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతాల్లోను పోలీసులు ఇదే తరహా ధోరణిని అవలంబించారు.
- పోలీసులు కాన్వాయ్‌లోని వాహనాలను అడ్డుకున్న ప్రతిసారి.. నిమిషాల వ్యవధిలో రెట్టించిన ఉత్సాహంతో పార్టీ శ్రేణుల వాహనాలు ఎక్కడక్కడ కాన్వాయ్‌లో వచ్చి చేరాయి.
- పెందుర్తి హైవేపైనా అడ్డుకోగా పినగాడి, సబ్బవరం, అనకాపల్లి ఇలా.. పార్టీ శ్రేణుల వాహనాలు కాన్వాయ్‌లో కలుస్తూ పర్యటనకు మరింత ఊపు తెచ్చారు.
- అనకాపల్లి మండలం మార్టూరు జంక్షన్ వద్ద వాహనదారులను సైతం ఎక్కడకు వెళుతున్నారో తెలుసుకున్న తర్వాతే పంపించారు. కొత్తూరు జంక్షన్ వద్ద జగన్‌ను చూసేందుకు వెళుతున్న జనాలను పోలీసులు అడ్డగించారు.


మెడికల్ కాలేజీ దగ్గర ప్రజలను నిలువరించేందుకు ఇనుప కంచె వేసిన పోలీసులు

- కశింకోట మండలం నర్సింగపల్లి వద్ద ఆటోల్లో ప్రయాణికులను వెళ్లనీయలేదు. అత్యవసర పనులపై వెళుతున్నట్లు ఆధారాలు చూపిస్తే గానీ ఆటోల్లో ప్రయాణికులను ముందుకు కదలనీయలేదు.
- యలమంచిలి ఫ్లై ఓవర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. షేకిల్లపాలెం హైవేలో సైతం ద్విచక్ర వాహనదారులను వెళ్లకుండా అడ్డుకున్నారు.
- నర్సీపట్నం నియోజకవర్గంలో ఇతర గ్రామాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సుల్లో పోలీసులు ఎక్కి మరీ ప్రయాణికులు ఎక్కడకు వెళుతున్నారని ఆరా తీసి పంపించారు.

చేతులెత్తి మొక్కుతూ.. మనసారా అభివాదం చేస్తూ.. ముందుకు సాగిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

కష్టాలు వింటూ.. వినతులు స్వీకరిస్తూ..


బల్క్ డ్రగ్ వద్దు అనే ప్లకార్డును ప్రదర్శిస్తూ..

- మాజీ సీఎం జగన్ పర్యటనలో ప్రజలు, గ్రామస్తులు తమ కష్టాలు, సమస్యలను విన్నవించుకునేందుకు పోటీ పడ్డారు. ప్రతి ఒక్కరి బాధలను వింటూ భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.
- ఎయిర్‌పోర్టు దాటిన తరువాత కాకానినగర్ వద్ద వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు మంత్రి రాజశేఖర్, అయోధ్యరామయ్యతో పాటు పలువురు జగన్‌ను కలిశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, కార్మికులకు అండగా ఉంటామని జగన్ హామీ ఇచ్చి ముందుకు కదిలారు.


ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న మాజీ సీఎం జగన్

- బి.భీమవరంలో బల్క్ డ్రగ్ పార్క్ బాధిత నిర్వాసితులు కలిశారు. ఆ పార్క్ వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. వారి కష్టాలను తెలుసుకున్న జగన్.. బాధితులు తీసుకొచ్చిన ప్లకార్డును పట్టుకుని వారికి మద్దతు తెలిపారు.
- గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కాపాడాలని రైతులు, కార్మికులు జగన్‌ను కోరారు.
- తాళ్లపాలెం జంక్షన్ వద్ద ఎన్ఏవోబీ నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు.
- ఇలా అనేక ప్రాంతాల్లో స్థానిక సమస్యలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై జగన్‌కు వినతిపత్రాలు అందజేశారు.


అభిమాన నేతకు హారతిస్తూ..


అదిరిందిగో జగనన్న

పాల్గొన్నది వీరే..

శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, తనూజరాణి, పార్టీ విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లా అధ్యక్షులు కేకే రాజు, అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, పుష్పశ్రీవాణి, ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రులు విడదల రజినీ, పేర్ని నాని, దాడిశెట్టి రాజా, సిదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు, శోభా హైమావతి, మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, వాసుపల్లి గణేష్ కుమార్, కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, మళ్ల విజయప్రసాద్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మి, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, మాజీ ఎంపీలు భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, సమన్వయకర్తలు మలసాల భరత్‌కుమార్, మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, పేరాడ తిలక్, సీఈసీ సభ్యుడు కోలా గురువులు, రాష్ట్ర కార్యదర్శులు చింతకాయల సన్యాసిపాత్రుడు, చిక్కాల రామారావు, వీసం రామకృష్ణ, పైలా శ్రీనివాసరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ సతీష్, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, పీవీ సురేష్, ముఖ్యనేతలు శరగడం చినఅప్పలనాయుడు, గండి రవి, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు జాన్ వెస్లీ, పేడాడ రమణికుమారి, బోని శివరామకృష్ణ, మంచా నాగమల్లేశ్వరి, అల్లంపల్లి రాజుబాబు, శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండకు భయపడలేదు.. వర్షానికి వెరవలేదు..

మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు జనం పోటెత్తారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రారంభమైన జనజాతర.. నర్సీపట్నం చేరేసరికి సముద్రంలా ఉప్పొంగింది. జై జగన్ అంటూ చేసిన నినాదాలతో జంక్షన్లు మార్మోగిపోయాయి. గోపాలపట్నం, వేపగుంట, చినముషిడివాడ, పెందుర్తి ప్రాంతాల్లో విశాలమైన బీఆర్‌టీఎస్ రహదారి కూడా జనసంద్రంగా మారిపోయింది. మధ్యాహ్నం 2 గంటలకు మండే ఎండలోనూ జగన్‌కు హారతులు పడుతూ.. పూలు జల్లుతూ, గజమాలలు వేస్తూ కరచాలనాలు చేశారు. అక్కడి నుంచి అనకాపల్లికి చేరుకున్న తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం చిల్లు పడినట్లు ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. అయినప్పటికీ.. ఏ ఒక్కరూ వెనక్కు వెళ్లలేదు. ఆ జోరు వర్షంలోనే జగన్‌కు జేజేలు కొట్టారు. అనకాపల్లి నుంచి నర్సీపట్నం మెడికల్ కాలేజ్ వరకు జగన్‌ను జనసునామీలా చుట్టేశారు. కాన్వాయ్ కదిలేందుకు కూడా వీలులేకుండా బారులు తీరారు. అభిమానంతో ఉరకలెత్తుతున్న ప్రజల్ని చూసి వైఎస్ జగన్.. అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. నర్సీపట్నం చేరుకున్నాక జై జగన్ నినాదాలు మరింత మిన్నంటాయి. వైద్య కళాశాల వద్ద పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జగన్‌కు స్వాగతం పలికారు.


వర్షంలోనే మహిళలతో మాట్లాడుతున్న జగన్




అభిమాన నేతకు అభివాదం

సమస్యలు వింటూ.. భరోసానిస్తూ..

ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పరామర్శించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి




కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

డాబాగార్డెన్స్: పచ్చకామెర్లతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పార్వతీపురం జిల్లా కురుపాం మండలం శివన్నపేట గురుకులం ఆశ్రమ పాఠశాల హాస్టల్ విద్యార్థులను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రాత్రి పరామర్శించారు. కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న సుచిత్ర, లాస్య, స్మైల్, భవిష్య, మాధవి, కీర్తన, సాయి, ప్రణవి, గ్రీష్మ, విద్యా, రమ్య, సంజన, అశ్విని, ధరణి, అఖిల, దీపిక, నీహారిక తదితర పిల్లల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కాసేపు పిల్లలతో ముచ్చటించారు. తాగునీరు, భోజనం బాగోలేదని విద్యార్థినులు చెప్పారు. ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. వార్డులో చికిత్స పొందుతున్న పిల్లలందర్నీ ఆప్యాయంగా పలకరించగా.. వారంతా సంతోషంగా వైఎస్ జగన్‌తో మాట్లాడారు.

పర్యటన సాగిందిలా..

- ఉదయం 10.16 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో బయలుదేరి ఉదయం 11.03 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.
- 11.22 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చారు. అక్కడకు వచ్చిన వైఎస్సార్ సీపీ నేతలను ఆత్మీయంగా పలకరించారు. కార్యకర్తలు, అభిమానాలకు కరచాలనం చేశారు.
- ఉదయం 11.25 గంటలకు విమానాశ్రయం నుంచి మాజీ సీఎం జగన్ కాన్వాయ్ బయలుదేరింది.
- మధ్యాహ్నం 12.29కు వేపగుంటకు చేరుకున్నారు. అక్కడ భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిమానాలు ఉండడంతో వారికి అభివాదాలు చేస్తూ ముందుకు వెళ్లారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు పెందుర్తి జంక్షన్‌కు కాన్వాయ్ చేరుకుంది. అక్కడ కూడా భారీ సంఖ్యలో మహిళలు, వృద్ధులు జగన్‌కు గజమాలతో స్వాగతం పలికారు. వారందరికీ అభివాదం చేస్తూ జాతీయ రహదారిపై అనకాపల్లి వైపు కదిలారు.
- మధ్యాహ్నం 2.20కి అనకాపల్లి చేరుకున్నారు. భారీ వర్షంలోను జననేతతో కరచాలనం చేసేందుకు ప్రజలు పోటీ పడ్డారు.
- మధ్యాహ్నం 3.19కి కశింకోట మండలం తాళ్లపాలెం జంక్షన్ వద్ద జగన్‌ను చూసేందుకు హోరు వానలోను తరలివచ్చారు.
- మధ్యాహ్నం 3.50కి భీమవరం వద్ద జగన్‌కు భారీ సంఖ్యలో ప్రజలు స్వాగతం పలికారు.
- సాయంత్రం 4.20కి కన్నూరుపాలెంకు చేరుకున్న జననేతకు అక్కడి జనసందోహం నీరాజనాలు పలికింది.
- సాయంత్రం 5 గంటలకు మెడికల్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. నిర్మాణాలను పరిశీలించారు.
- సాయంత్రం 5.12 నుంచి 5.55 వరకు మీడియా సమావేశంలో మాట్లాడారు.
- సాయంత్రం 6.30కి మెడికల్ కాలేజీ నుంచి బయలుదేరారు.
- రాత్రి 8.15 గంటలకు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గిరిజన బాలికల హాస్టల్ విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.
- రాత్రి 9.23 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.
- రాత్రి 9.53 గంటలకు విమానంలో తిరుగుపయనమయ్యారు.

పరుగుల ఫన్‌డుగ



- టీం ఇండియాపై దక్షిణాఫ్రికా విజయం
- మొదట టీం ఇండియా బ్యాటర్ రిచా ఘోష్ మెరుపులు
- ఒంటి చెత్తో భారీ లక్ష్యాన్ని ఛేదించిన సఫారీ బ్యాటర్ నాడిన్ డి క్లర్క్

విశాఖ స్పోర్ట్స్ : రెండు పులులు బరిలోకి దిగితే ఎలా ఉంటుందో తెలుసా? ఒకరిపై ఒకరు పంజా విసురుకుంటే ఎంత భయంకరంగా ఉంటుందో తెలుసా? విశాఖ వేదికగా జరిగిన మహిళల క్రికెట్ మ్యాచ్‌లో టీం ఇండియా బ్యాటర్ రిచా ఘోష్, సఫారీ బ్యాటర్ నాడిన్ డి క్లర్క్ తమ ప్రదర్శనతో ఆ ప్రశ్నలకు బదులిచ్చారు. నువ్వా నేనా అన్నట్టు ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో వీరిద్దరూ పరుగుల వరద సృష్టించారు. మ్యాచ్‌కు ముందు విశాఖలో వరుణుడు కాసేపు ఆనందపు జల్లులు కురిపించాడు. దీంతో తమకు అనుకూలంగా ఉంటుందని భావించిన దక్షిణాఫ్రికా టీం టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. అనుకున్నట్టే టాప్ ఆర్డర్లు ఒక్కొక్కరిగా పెవిలియన్‌కు చేరుకున్నారు. వంద పరుగులకే టాప్ ఆర్డర్ కుప్పకూలిపోయింది. ఇలాంటి సమయంలో రిచా ఘోష్ సివంగిలా విరుచుకుపడింది. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. అంతవరకు పట్టు బిగించామన్న దక్షిణాఫ్రికాకు చెమటలు పట్టించింది. 11 ఫోర్లు, మూడు భారీ సిక్సర్లతో 94 పరుగులు సాధించింది. ఆఖరి ఓవర్ భారీ సిక్స్‌కు ప్రయత్నించి దురదృష్టవశాత్తూ క్యాచ్‌ఔట్‌గా వెనుతిరిగింది. అయితే అప్పటికే భారత్ స్కోరు 251 చేరింది. భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు తడపడ్డారు. 81 పరుగులకే 5 కీలక వికెట్లు చేజార్చుకున్నారు. ఈ క్రమంలో భారత్ విజయం నల్లేరుమీద నడకే అనున్నారంతా... కానీ అప్పుడు సివంగిలా నాడిన్ డి క్లర్క్ ఎదురుదాడికి దిగింది. ఒంటి చేత్తో భారీ లక్ష్యాన్ని ఉఫ్ అని ఊదేసింది. కేవలం 54 బంతుల్లో 84 పరుగులు చేసింది. ఇందులో 8 ఫోర్లు, 5 భారీ సిక్సర్లు ఉన్నాయి. చివరి ఓవర్లలో ఆకాశమే హద్దుగా సిక్సర్ల వర్షం కురిపించడంతో సఫారీల విజయ సంబరాలు అంబరాన్నంటాయి.











మెడ కోసుకుని వ్యక్తి ఆత్మహత్య

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామచంద్రనగర్‌లో గడ్డి రాజేష్ అనే వ్యక్తి కత్తితో మెడ కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేష్ తన తల్లి పద్మ, భార్య లక్ష్మితో కలిసి నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం భార్య లక్ష్మి బయటకు వెళ్లగా, రాజేష్ బాత్రూమ్ లోకి వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత కుమారుడు రక్తపు మడుగులో ఉండడం చూసి తల్లి పద్మ, కోడలు లక్ష్మికి ఫోన్‌లో సమాచారం అందించింది. ఇంటికి చేరుకున్న లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థలే ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు.

భూసేకరణ త్వరగా పూర్తి చేయండి

మహారాణిపేట: జిల్లా పరిధిలో చేపట్టనున్న విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు, రైల్వే లైన్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని సూచించారు.

రాజకీయ కక్షతోనే బదిలీ..!

- అక్రమాలు సాగవన్న అక్కసుతోనే ప్రజాప్రతినిధుల ఫిర్యాదులు?
- వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌పై బదిలీ వేటు
- ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా నియామకం
- కలెక్టర్‌కు వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు

విశాఖ సిటీ : విశాఖ అభివృద్ధికి కీలకమైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి.. సమర్థవంతమైన, నిజాయతీ గల అధికారిగా గుర్తింపు తెచ్చుకున్న విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌పై కూటమి ప్రభుత్వం బదిలీ వేటు వేయడంపై అధికార వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. కూటమి నేతల అక్రమాలు సాగనీయడం లేదన్న అక్కసుతోనే ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకువచ్చి బదిలీ చేయించినట్లు వార్తలు గుప్పుమం టున్నాయి. ప్రధానంగా మాస్టర్‌ప్లాన్‌లో ఇష్టానుసారంగా మార్పులు, చేర్పులకు కూటమి ప్రజాప్రతినిధులు గట్టిగా పట్టుబడుతున్నారు. వారి భూములు, అనుచరుల వ్యాపారాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్‌లో సవరణలకు చేస్తున్న సిఫార్సులను పట్టించుకోని కారణంగానే కూటమి నేతలు కత్తి కట్టినట్లు వార్తలు వినిపిస్తున్నారు. ఇదిలా ఉంటే వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ కమిషనర్‌పై కక్ష కట్టి ఎమ్మెల్యేలతో ఫిర్యాదు చేయించినట్లు గత కొద్ది నెలలుగా అధికారుల మధ్య చర్చ జరుగుతోంది. మూడు నెలలుగా కమిషనర్‌ను బదిలీ చేస్తున్నట్లు ప్రచారం లేవనెత్తారు. ఇందుకు తగ్గట్లుగానే కమిషనర్ విశ్వనాథన్‌ను ప్రభుత్వం బదిలీ చేయడం గమనార్హం.

పాలనలో తనదైన ముద్ర

కె.ఎస్.విశ్వనాథన్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన నాటి నుంచి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. రాజకీయ, అధికారుల అక్రమాలకు అడ్డుకట్టవేస్తూ వస్తున్నారు. అనంతరం ఆయన జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా కొన్నాళ్లు పనిచేసి 2024, జూలై 23న వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్ బాధ్యతలు చేపట్టారు. సంస్థలో దీర్ఘకాలంగా నెలకొన్న అవినీతిపై దృష్టి పెట్టారు. వీఎంఆర్‌డీఏ చేపట్టిన అనేక ప్రాజెక్టులు ఏళ్లుగా సా..గుతున్న ప్రాజెక్టులతో పాటు అధికారులను సైతం పరుగులు పెట్టించారు.

అక్రమాలకు అడ్డుపడుతున్నారనే అక్కసుతో..

నిక్కచ్చిగా ఉండే విశ్వనాథన్ వ్యవహార శైలిపై కూటమి నేతలు ముందు నుంచీ గుర్రుగా ఉన్నారు. ఇదే సమయంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా ప్రణవ్‌గోపాల్ నియమితులయ్యారు. కమిషనర్‌గా విశ్వనాథన్ ఉంటే వీఎంఆర్‌డీఏలో తమ అక్రమాలు సాగవన్న నిర్ణయానికి వచ్చారు. కొద్ది నెలల క్రితం కమిషనర్ విశ్వనాథన్, చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మధ్య వివాదం చోటుచేసుకుంది. ఒక హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో కమిషనర్‌ను చైర్మన్ దఫేదార్ తోశారు. దీనిపై కమిషనర్ విశ్వనాథన్ అతడిపై సీరియస్ అయ్యారు. ఇదే అదునుగా భావించిన చైర్మన్.. కమిషనర్‌కు వ్యతిరేకంగా సిబ్బందితో నిరసన చేయించాలని భావించినట్లు సంస్థలో చర్చ జరిగింది. ఆ పనిచేయకపోయినప్పటికీ.. కమిషనర్‌పై ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేయించినట్లు వార్తలు వినిపించాయి. అతడిని ఇక్కడి నుంచి బదిలీ చేయాలని ఒత్తిడి తీసుకువచ్చారన్న టాక్ ఉంది. గత కొద్ది నెలలుగా కమిషనర్ బదిలీ తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.



ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా బదిలీ

తాజాగా ఐఏఎస్ అధికారుల బదిలీల్లో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక్కడి నుంచి ఐ అండ్‌పీఆర్ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

మద్యం మత్తులో నిందితుడు హల్‌చల్

డీ మార్ట్ భవనంపై నుంచి దూకుతానంటూ బెదిరింపులు

గోపాలపట్నం: మద్యం మత్తులో ఉన్న ఒక వ్యక్తి డీ మార్ట్ భవనంపైకి ఎక్కి, కిందకు దూకేస్తానని బెదిరించి కలకలం సృష్టించాడు. గోపాలపట్నం, గాజువాక పోలీసులు అతన్ని కిందకు దించి, పరిస్థితిని సుఖాంతం చేశారు. వివరాల్లోకి వెళితే.. కొద్ది రోజులుగా పరారీలో ఉన్న హత్యకేసు నిందితుడు వడ్డాది కృష్ణ గోపాలపట్నం ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గాజువాక, గోపాలపట్నం పోలీసులు అతన్ని పట్టుకోవడానికి ప్రయత్నించారు. అయితే మద్యం సేవించి ఉన్న కృష్ణ, పోలీసుల నుంచి తప్పించుకునేందుకు గోపాలపట్నంలోని డీ మార్ట్ భవనం పై అంతస్తు సన్‌షెడ్‌పైకి ఎక్కాడు. కిందకు దూకేస్తా అని హల్‌చల్ చేయడంతో.. ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందారు. పోలీసులు, స్థానికులు కలిసి రగ్గు లాంటి దాన్ని కింద పట్టుకుని అతన్ని కాపాడేందుకు యత్నించారు. ఎట్టకేలకు పోలీసులు అతన్ని నచ్చజెప్పి, సురక్షితంగా కిందకు దించారు. దీంతో అక్కడ గుమిగూడిన వారంతా ఊపిరి పీల్చుకున్నారు. వడ్డాది కృష్ణ గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యా యత్నం కేసులో నిందితుడు. కొద్ది రోజులుగా పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. గోపాలపట్నం పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని గాజువాక పోలీసులకు అప్పగించారు.



డీమార్ట్ భవనం సన్‌షెడ్‌పై కూర్చున్న కృష్ణ

తప్పించుకు తిరుగుతున్న నిందితుడికి రిమాండ్

అల్లిపురం: లైంగిక దాడి కేసులో రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడ్ని మహారాణిపేట పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వివరాలను ఇన్‌స్పెక్టర్ దివాకర్ యాదవ్ తెలిపారు. ప్రకాశం జిల్లా, చీరాల ప్రాంతానికి చెందిన పదార్థి వీరేంద్ర అలియాస్ చెర్రీ, 2017లో నమోదైన లైంగిక దాడి కేసులో అరెస్ట్ అయ్యి, ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. బెయిల్ పొందిన తర్వాత అతను కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో నిందితుడిపై కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. సెల్ ఫోన్ వాడకుండా, ఎవరికీ చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని, సీఐ దివాకర్ యాదవ్ నేతృత్వంలోని పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



నిందితుడితో మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్

మత్స్య సంపద నాణ్యత, మార్కెటింగ్ మెరుగుదలపై దృష్టి

మహారాణిపేట: సంప్రదాయ మత్స్యకారుల అవసరాలు, సుస్థిర వేట విధానాలపై అవగాహన పెంచే లక్ష్యంతో సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సంప్రదింపుల వర్క్‌షాప్ విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ హాజరై ప్రసంగించారు. మత్స్య సంపద నాణ్యత, మార్కెటింగ్ మెరుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా సముద్ర సంపద పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న మత్స్యకారులను కలెక్టర్ 'నీలి యోధులు'గా అభివర్ణించి, వారిని ఘనంగా సన్మానించారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి. లక్ష్మణ రావు, ప్రధాన శాస్త్రవేత్తలు శాస్త్రవేత్తలు డాక్టర్ కిజకుడన్, డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ మీనా, ఎంపీడా డీడీ మహంతి సహా ఇతర సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.



నీలి యోధులైన మత్స్యకారులను సత్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్లో గురువారం రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మహారాష్ట్రలోని రాయిగఢ్ జిల్లాకు చెందిన శశాంక్ జితేంద్ర చౌహాన్, శంకర్ ప్రభురెడ్డి..ముంబైకి అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 1,92,400 విలువైన 38.48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఖతార్‌లో మైనార్టీ నర్సుల ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: ఖతార్ దేశంలో దోహ లోకేషన్‌లో హోమ్ కేర్ నర్స్ ఉద్యోగ అవకాశాల కోసం అర్హులైన మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. బీఎస్సీ, జీఎన్ఎం నర్సింగ్ విద్యార్హత ఉండి అనుభవం వున్న వారు ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యానిర్వాహక సంచాలకులు షంషున్నీసా బేగం తెలిపారు. ఏపీ ప్రభుత్వం , స్కిల్ డెవెలప్‌మెంటు కార్పొరేషన్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 21 నుంచి 40 ఏళ్ల యువతీ,యువకులు అర్హులని, ఆసక్తి గల వారు https@// naipunyam. ap. gov. in/ user& registrationpage& program& registration వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 98499 01159, 94417 16209, 91002 45438 సంప్రదించాలి. లేదా ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్సు కార్పొరేషన్, డోర్.నంబరు 24.3.10, డాక్టర్ దీన్ శాదిఖాన మేడ పైన, ఓల్డ్ పోస్టు ఆఫీసు, విశాఖ-530001 సంప్రదించాలన్నారు.

'శ్రద్ధ'తో నిరాశ్రయులకు రక్ష

- నిరాశ్రయుల బాగోగులే లక్ష్యంగా తపన
- దేశ వ్యాప్తంగా ఎందరో ఇళ్లలో వెలుగు నింపిన సంస్థ
- నేడు ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం



మానసిక వికలాంగురాలికి కౌన్సెలింగ్ చేస్తున్న శ్రద్ధ ఫౌండేషన్, ఏయుటీడీ సిబ్బంది



టీఎస్ఆర్ కాంప్లక్స్ పురుషుల నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులు

అల్లిపురం: దేశవ్యాప్తంగా అనాథలు, నిరాశ్రయులు, మానసిక వికలాంగులు, వృద్ధులు రోడ్లపై నిత్యం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లు, సరైన దుస్తులు లేక దీన స్థితిలో తిరిగే ఇలాంటి వారికి సహాయం అందించేందుకు జీవీఎంసీ సహకారంతో ఏయూటీడీ సంస్థ నగరంలో పలుచోట్ల నిరాశ్రయ వసతి గృహాలను నిర్వహిస్తోంది. ఈ వసతి గృహాల్లో నిరాశ్రయుల కోసం ఆహారం అందించడంతో పాటు, చికిత్స వరకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

మానసిక వికలాంగులకు ప్రత్యేక చికిత్స

సామాజిక సేవా రంగంలో మెరుగైన సేవలు అందిస్తున్న ఏయూటీడీ.. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడంతో పాటు మానసిక వికలాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో దీనస్థితిలో, మలమూత్రాలతో తడిసిపోయి తిరిగే ఇలాంటి వారి గురించి సమాచారం అందిన వెంటనే ఏయూటీడీ సిబ్బంది స్పందిస్తారు. వారికి అక్కడికక్కడే సపర్యలు చేసి, బట్టలు మార్చి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుంటారు. వీరికి ప్రత్యేకంగా మానసిక చికిత్సాలయంలో చికిత్స అందించడంతో పాటు, ప్రముఖ సంస్థ శ్రద్ధ ఫౌండేషన్ ద్వారా ప్రత్యేక మెడికేషన్ అందించి వారిని సాధారణ మనుషులుగా తీర్చిదిద్దుతున్నారు.

పోలీస్ కమిషనర్ సహకారంతో 'మిషన్ జ్యోతిర్గమయ'

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సహకారంతో ఇటీవల విశాఖలో 'మిషన్ జ్యోతిర్గమయ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 270 మంది నిరాశ్రయులను గుర్తించి, ఏయూటీడీ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. వారిలో మానసికంగా బాధపడుతున్న వారికి శ్రద్ధ ఫౌండేషన్ ద్వారా మందులు వాడించడంతో ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం వారి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు అప్పగించే కార్యక్రమాన్ని శ్రద్ధ ఫౌండేషన్, ఏయూటీడీ సంయుక్తంగా చేపట్టాయి. పూణేకు చెందిన శ్రద్ధ ఫౌండేషన్‌కు దేశవ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ ఉంది. దాని సహాయంతో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన నిరాశ్రయులను వారి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటనలు కోకొల్లలు. సంవత్సరాలు గడిచిపోయి, ఇంక చనిపోయారని అనుకున్న వారు కూడా కుటుంబ సభ్యుల చెంతకు చేరి ఆశ్చర్యపరిచిన సందర్భాలు అనేకం. ఈ సంస్థల సేవలతో అనేక కుటుంబాల్లో తిరిగి ఆనందం నిండుతోంది.



టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో పంక్తి భోజనాలు చేస్తున్న మహిళలు, పురుషులు



మానసిక వ్యాధితో కుటుంబాన్ని కోల్పోయాను



మానసిక వ్యాధితో నా కుటుంబాన్ని కోల్పోయాను. వ్యాధితో బాధపడుతూ దిక్కు తోచకుండా రోడ్డునపడ్డాను.. నన్ను ఏయూటీడీ సిబ్బంది అక్కున చేర్చుకుని చికిత్స అందజేశారు. ఇప్పుడు నా ఆరోగ్యం బాగుపడింది. ఇప్పుడు ఇక్కడే చిన్న చిన్న పనులు చేసుకుంటున్నాను.

– బి.వీరేశలింగం, నిరాశ్రయుడు

ఏయూటీడీ - శ్రద్ధ భాగస్వామ్యానికి ఏడాది పూర్తి



ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న అసోసియేషన్ ఫర్ అర్బన్ అండ్ ట్రైబల్ డెవలప్మెంట్ (ఏయుటీడీ), శ్రద్ధ రిహాబిలిటేషన్ ఫౌండేషన్, ముంబై మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ఏడాది గడిచింది. ఏడాది కాలంలో, భారతదేశం వ్యాప్తంగా సంచరించే మానసిక వ్యాధిగ్రస్త నిరాశ్రయులను చికిత్స చేసి, కోలుకున్న తర్వాత 94 మందిని వారి కుటుంబాలతో మళ్లీ కలిపారు. వీరిలో ఒక తల్లి-పిల్ల జంట కూడా ఉంది, ఇప్పటి వరకు కుటుంబాలతో కలసిన వారు 36 మంది (22 పురుషులు, 14 మహిళలు, 1 చిన్నారి). ఏయుటీడీ నుండి మహారాష్ట్రలోని శ్రద్ధ కర్జట్, నాగ్‌పూర్ కేంద్రాలకు తరలించి, అక్కడ చికిత్స అనంతరం కుటుంబాలతో మళ్లీ కలిసిన వారు 58 మంది (47 పురుషులు, 11 మహిళలు). స్థానిక వైద్యులు, సంస్థలలో డాక్టర్ సత్య వంశీ, వరుణ్ ల్యాబ్, గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజ్, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ వంటి వారు కూడా తమ సేవలు, సహకారాలు అందించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సహకారంతో మరింత మందిని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చగలిగాం. ఏయుటీడీ కార్యదర్శి ప్రగడ వాసుతో కలసి శ్రద్ధ ఫౌండేషన్ పరిచేయడం ఆనందంగా ఉంది.

– డాక్టర్ భారత్ వట్వాని (ఎమ్‌డీ సైకియాట్రీ), సంస్థాపక ట్రస్టీ – శ్రద్ధ రిహాబిలిటేషన్ ఫౌండేషన్

ఇప్పటి వరకు 309 మందిని రెస్క్యూ చేశాం



2013 నుంచి ఇప్పటి వరకు 309 మందిని రెస్క్యూ చేశాం. అందులో 94 మహిళలు, 209 మంది పురుషులను వారి వారి సొంత రాష్ట్రాలకు పంపగలిగాం. పూణేలోని శ్రద్ధ ఫౌండేషన్ ద్వారా అప్పగించగలిగాం. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ గతంలో మానవతా దృక్పథంతో వారికి రక్షించాలని, రెస్క్యూ చేయాలని ఆర్డర్స్ పాస్ చేశారు. కాని వాటిని ఇప్పుడు అమలు చేయని పరిస్థితి. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వం సకాలంలో స్పందించి సహకారం అందజేస్తే మరిన్ని సేవలు అందించగలం.

– ప్రగడ వాసు, ఏయుటీడీ కార్యదర్శి

రెండేళ్లుగా ఆశ్రయం కల్పించారు



నాది తమిళనాడు. నా అన్నవారు ఎవరూ లేరు. మానసికంగా బాలేక దారితప్పి విశాఖ రైల్వే స్టేషన్‌కు వచ్చేశా. ఏడీటీడీ వారు రక్షించి చికిత్స చేయించారు.. రెండేళ్లుగా జీవీఎంసీ, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. అన్ని రకాల వసతులు అందుతున్నాయి.

– జి.హేమానంద్, తమిళనాడు